# శవం నాకు సాక్షిగా...

-డాక్టర్ ఎమ్. సుగుణరావు

సాయంత్రం ఐదవుతోంది. అయినా ఆ ఘాట్ రోడ్ పక్కనున్న గుడిసెలో కూర్చున్న సత్యం గుండెల్లో సన్నగా వణుకు.

శీతాకాలపు చలిలోకూడా ముచ్చెమటలు పోస్తున్నాయి. పల్చగా ప్రారంభమైన వాన చినుకులు క్రమేపీ పెద్దవవుతున్నాయి.

ఉరుములు, మెరుపులతో ఆ వాతావరణం మరింత దిగులు పెంచుతోంది సత్యానికి.

ఎదురుగా దేవుడు - తెల్లటిమీసాలు, బుగ్గ మీది కత్తి గాట్లు పడిన నల్లటి ముఖం.

'రెండు గంటల క్రితం వరకూ, దేవుడు తన పక్కనుంటే చాలు భయం కరమైన కీకారణ్యంలో నయినా ప్రయాణించొచ్చనీ, అతను నిశిరాత్రిలోనయినా దివిటీలా దారి చూపే దేవుడనీ అనుకునేవాడు.

ఇప్పుడు ఎదురుగా అతన్నుంచుకొని భయం తో వణికిపోతున్నాడు.

పైకి చూశాడు.

గుడిసె ఒకవైపు నించి ధారా పాతంగా వాన కురుస్తోంది. కొండ పక్కగా ఉంది గుడిసె.

కొండరాళ్ళు కాటేయబోయే సర్పాల్లా కని పిస్తున్నాయి.

'ఇంకోగంట లోగా వాళ్ళు రాకపోతే ఈ చీకటి నన్ను మింగేటట్టుంది...' అనుకుంటూ జేబులు తడుముకున్నాడు.

నలిగిన సిగరెట్టుపెట్టె, అగ్గిపెట్టె... 'అమ్మయ్య' అనుకుంటూ సిగరెట్టు వెలిగించి గుండె ల్నిండా పొగపీల్చి వదిలాడు.

కొంచెం భయం తగ్గింది. ఏమిటో శవంతో ఒంటరి నిరీక్షణ!

దేవుడు శవంగా మారాడు అనే విషయం జీర్ణించుకోలేక పోతున్నాడు.

తనను కంటికి రెప్పలా చూసుకునే దేవుడులోని జీవుడు పోగానే తనకెందుకింత భయం కలుగుతోంది...

లేదు! దేవుడు తననేమీ చెయ్యడు. బతి కుండగా తన క్షేమం కోరేవాడు. చనిపోయింతర్వాత హానిచేస్తాడా అలా సమా ధాన పడినా ఎదురుగా శవం అతడిలో భయాన్ని క్షణ క్షణానికి పెంచుతోంది.

దిగులు మేఘం కమ్ముకుం టుంటే మనసు మళ్ళించడానికి ఆలోచనల సుడిలో ఇరుక్కుపోయాడు.

ఉద్యోగం కోసం మూడేళ్ళు తిరిగి అదృష్టవశాత్తూ విలేజి అసిస్టెంటుగా జాయినయ్యాడు ఏజెన్సీ ఏరియాలో. బ్రతుకు అనుక్షణం భయానకంగా గడు



స్తోంది.

తను రెవిన్యూ డిపార్ట్‌మెంటులో చేరడానికి మరో కారణం అదనపు సంపాదన, కాని దేవుణ్ణి చూసిన తర్వాత తన అభిప్రాయం మార్చుకున్నాడు.

ధర్మానికి కట్టుబడ్డ ఏ చదువూ సంధ్యలు లేని ఈ గ్రామ తలారి ఎంత నిజాయితీగా ప్రవర్తించి నేలకొరిగేడు.

నిజంగా పేరుకు తగ్గట్టు దేవుడు దేవుడే! సత్యం ఆలోచనల్లోంచి తేరుకుని రెండు కన్నీటి బొట్లు రాల్చాడు. ఎంత మరిచిపోదామన్నా జరిగిన అమానుషం కళ్ళముందు కదలాడుతోంది.

దేవుడు చంపబడి రెండుగంటలవుతోంది. సర్పంచ్ మనుషులు తలమీద కొట్టి కొండ క్రిందకు తోసేశారు. సమయానికి ధర్మయ్యకు విషయం తెలిసి శవాన్ని ఈ గుడిసెలోకి చేర్చి, తనను కాపలాగా ఉంచి ప్రక్క ఊళ్ళో కేంపుమీదున్న ఎమ్ ఆర్ ఓ గారి కోసం వెళ్ళాడు.

సర్పంచ్ దుర్మార్గం బయటపడాలంటే శవమేకదా సాక్ష్యం..." ఆలోచనలతో బుర్రవేడెక్కి పోతుందని కళ్ళుమూసుకొని నిద్రకుపక్రమించేడు. క్షణంలో నిద్రపట్టేసింది సత్యానికి.

★ ★ ★

అరగంట తర్వాత లేచాడు. కళ్ళు తెరిచేసరికి గుండె ఆగినంత పనయ్యింది. శవం లేదు. మైగాడ్, అరగంటలో ఏమయ్యిందీ? తనంత మొద్దు నిద్ర పోయాడా! మూడోకంటివాడికి తెలీకుండా తాము గుడిసెలో చేర్చిన శవం ఎలా మాయమయింది. సత్యంలో అర్థంకాని ప్రశ్నలు.

కాళ్ళు తడబడ్డాయి. మరి గుడిసెలో ఉండలేక పోయాడు. బయటికొచ్చేడు. అతడిలో భయం అధికం కాసాగింది. ఆ చీకట్లో పిచ్చిగా నడుస్తున్నాడు. భయం భయంగా నడుస్తున్నాడు.



అనవసరంగా ఇరుక్కు పోయా నురా భగవం తుడా అనుకొని మధనపడుతూ నడుస్తు న్నాడు. వర్షపు చినుకులు వంటిమీద పడుతున్నా చలనం లేకుండా నడుస్తున్నాడు.

నక్కల ఊళలు ఆ కొండ ప్రాంతంలో ప్రతిధ్వనిస్తూ అతడి గుండె దడను మరింత పెంచు తున్నాయి. సత్యం ఒక నిర్ణయానికొచ్చేసాడు.

తను పారిపోవాలి ఇక్కణ్ణించి - జరిగిన విషయంతో తనకేమీ సంబంధం లేదు. గబ గబ పరిగెడు తున్నాడు.

రోడ్డు పక్కనున్న రావిచెట్టు మీద గబ్బిలాలు వికృతంగా అరుస్తున్నాయి. గ్రద్దల గుంపు ఆకాశంలో. బారులు తీర్చి వెళుతోంది.

తడిసిన రోడ్డుమీద కాళ్ళు జారుతున్నా సత్యం పరుగుమానలేదు. చెప్పులు తెగిపోయాయి. రోడ్డుపక్కనున్న రాక్షసపొదలు ఆ చీకట్లో పొంచివున్న శత్రువుల్లా కనిపించాయి.

"ఏయ్ ఆగు" అనే కేక... ఫారెస్ట్ గార్డు కాబోలు... అయినా లెక్క చేయకుండా పరిగెడుతున్నాడు సత్యం - అర కిలోమీటరు దూరం పరిగెత్తాడు.

ఇంకో కిలోమీటరు వెళితే ఊరొస్తుంది. బస్సెక్కి తన స్వగ్రా మం చేరుకోవాలి.

అలా ఆలోచించు కుంటూ ప్రాణ భయంతో పరిగెడుతున్నాడు. తను లేకుంటే 'ఒక సత్యం' మరుగున పడిపోతుందని తెలిసీ పరిగెడు తున్నాడు.

పలాయనం సాగిస్తున్నాడు. ఇంతలో ఎదురుగా జీప్. ఎం.ఆర్.ఓ గారిదే. అతడి ముందే ఆగింది. ఏమిటలా పరిగెడుతు న్నావ్?! ఎం.ఆర్.ఓగారి ప్రశ్నకు కొంచెం తడబడి, "మీరింకా రాలేదని మండలాఫీసుకు వెళుతున్నా".. చెప్పాడు.

ఆయన "పద"... అనడంతో ట్రాన్స్‌లో ఉన్నవాడిలా అసంకల్పితంగా జీపెక్కాడు.

ఎమ్మార్వోతో పాటూ ఇన్స్‌పెక్టరు, ధర్మయ్య, డ్రైవరు ఉన్నారు జీపులో. ఐదో వ్యక్తిని చూడగానే సత్యానికి కాళ్ళ క్రింద భూమి పునాదుల్తో కదిలినట్లనిపించింది.

★ ★ ★

శవం మాయమైందన్న షాకులో ఉన్న సత్యానికి జీపులో సర్పంచును చూడగానే మతిపోయింది. గుండెలు అరచేతిలో పెట్టుకొని కూర్చున్నాడు జీపులో. ఆ నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ సర్పంచ్ నోరిప్పాడు.

"ఇన్స్ పెక్టరుగారూ, ధర్మయ్య మాటలు నమ్మి నన్ను ఉన్న ఫళంగా ఇలా లాక్కురావడం మీకు భావ్యమా, దేవుడు గాడు తాగి కొండమీంచి జారిపడ్డాడు. దానికి నేను బాధ్యుణ్ణా, దేవుణ్ణి చంపడానికి నాకతడేమైనా శత్రువా"... ఆ మాటలను ఇన్స్‌పెక్టరు సత్యం వంక

చూశాడు.

సత్యం మరి మాట్లాడలేదు. శవం మాయమైందని చెప్పడానికి ధైర్యం చాలలేదు. జీపు గుడిసెను సమీపిస్తుండ గా విధిలేక నోరిప్పేడు. "గుడిసెలో శవం లేదు. అరగంట కునుకు తీసేసరికి ఎవరో ఎత్తుకుపోయారు." గబగబా చెప్పేడు.

సర్పంచ్ ఆ మాటలకు ఫెళ్ళున నవ్వేడు.

"చూశారా వీరి మాటలకు అసలు పొంతనే లేదు, దేవుడిని వీళ్ళే చంపేసుంటారు. ముందు విలేజ్ అసిస్టెంటును అరెస్ట్ చెయ్యండి. అసలు కథ బయటపడుతుంది." సర్పంచ్ మాటలు విని ఇన్స్పెక్టరు వేగంగా గుడిసెలోకి నడిచాడు.

మిగతావారంతా బయటే నించున్నారు.

"వాట్ మిష్టర్ సత్యం జోక్ చేస్తున్నావా?!" అని అరిచాడు ఇన్స్పెక్టరు.

ఆ మాటలకు అందరూ గుడిసెలోకి తొంగి చూశారు. చనిపోయిన దేవుడు నిశ్చలంగా నిద్రపోతున్నట్టే వున్నాడు.

జరుగుతున్న సంఘటనలకు సాక్షీభూతంలా - సత్యానికి ఆ దృశ్యం చూడగానే కళ్ళుబైర్లు కమ్మాయి. క్షణంలో అతడికి స్పృహ తప్పింది.

★ ★ ★

"ఏమిటీ మిష్టరీ..." అనుకుంటూ ఎమ్మార్వో, ఇన్స్పెక్టరు ఆలోచనలో పడ్డారు. ధర్మయ్య జీపులోంచి హరికేను లాంతరు తీసుకొచ్చి వెలిగించాడు. ఇన్స్పెక్టరు క్షణం సేపు చుట్టూ ఛూసి ముక్కుపుటాలు పై కెగరేసి "సత్యానికి చుట్టకాల్చే అలవాటుందా..." అనడిగేడు ఎమ్మార్వోని...




"నీకు పాఠం చెప్పటం తనవల్ల కావటంలేదని మొత్తుకుంటోంది మీ టీచర్ సుందరమ్మ" గట్టిగా కోప్పడింది గౌరిని వాళ్ళమ్మ.

"ఆ మాట నేనెప్పుడో చెప్పా... ఆవిడ చెప్పేదాకా మీకు నమ్మకంకుదరట్లేదు!" చిరంజీవి, కార్తీక్‌లాంటి మాస్టర్లు ఉంటే చూడండి" అని గడుసుగా బదులిచ్చింది గౌరి.

-పాలుమూరి సంపత్‌కుమార్
ఇ.నం.3-8-17, రేచర్లపేట,
కాకినాడ-533 003.

"లేదే!?" అంటూ ఎమ్మార్వో ప్రశ్నార్థకంగా చూశాడు.

"మరైతే చుట్ట ఎవరు కాల్చినట్టు? శవమా" అంటూ ఇన్స్పెక్టరు నవ్వేడు అపుడే ఆరిపోయిన చుట్ట చూపిస్తూ.

సర్పంచ్ "నేనిక వెళ్ళొస్తాను. రేపు కలుస్తాను సార్..." అని అక్కణ్ణించి కదలబోయేంతలో "ఆగండి!? అనే బొంగురు గొంతు వినిపించింది.

అందరూ ఆశ్చర్యంగా చూస్తుండగా దేవుడు మెల్లగా నడుచుకుంటూ ముందు కొచ్చేడు.

అక్కడ చీమ చిటుక్కుమన్నా వినిపించే నిశ్శబ్దం. అందరూ నోరెళ్ళబెట్టి చూస్తూండిపోయారు.

"బాబోయ్ దెయ్యం... నాకు భయం... నేనిక వెళ్ళొస్తా"నంటున్న సర్పంచ్‌ను గట్టిగా పట్టుకున్నాడు ఇన్స్పెక్టర్.

దేవుడు మెల్లగా మాట్లాడటం ప్రారంభించేడు. ఆ మాటలు నూతిలోంచి పలికినట్లుగా వినిపిస్తున్నాయి. "నేను దెయ్యాన్ని కాదు. చావలేదు. నేనిక ఈ శవం వేషం వెయ్యలేను, అందర్ని గాభరాపెట్టినందుకు క్షమించండి. అసలు కథ వినండి.

దేవుడు మాటలకు అందరూ చెవులురిక్కించి వినసాగారు. సర్పంచ్ తలొంచుకున్నాడు. క్షణంసేపు ఊపిరి పీల్చుకొని ధర్మయ్య ఇచ్చిన నీళ్ళు తాగి మళ్ళీ కొనసాగించాడు.

"సర్పంచ్ తన మామిడితోటలో గంజాయి మొక్కలు వెయ్యడం నేను చూశాను. నేను పోలీస్ స్టేషనులో రిపోర్టిస్తానని భయపడి నా తలమీద కొట్టి కొండమీంచి తోశారు.

నా వళ్ళు చల్లబడడంతో చనిపోయానను కున్నారు. స్పృహలో లేని నన్ను ధర్మయ్య తీసుకొచ్చి గుడిసెలో ఉంచాడు.

రెండుగంటలు శవంలా పడుకో వడంతో విసుగేసి చుట్ట తాగడానికి బయట కొచ్చాను. సత్యం బాబు కంగారుపడ్డాడు.

మొత్తానికి సత్యం, ధర్మయ్యలు ఈ దేవుడిని రక్షించారు. ఒక నిజాన్ని నిలబెట్టారు." దేవుడు చెప్పడం పూర్తి చేశాడు.

స్పృహలో కొచ్చిన సత్యం మాట్లాడుతున్న దేవుడిని చూడకుండా "నన్ను అరెస్ట్ చేస్తారా ఇన్స్పెక్టరు గారూ" అన్నాడు భయం భయంగా...

"నిన్నెందుకు అరెస్టు చేయడం" అన్నాడు ఇన్స్పెక్టరు సర్పంచ్ చేతులకు బేడీలు తగిలిస్తూ...

హఠాత్తుగా పక్కనే నించున్న దేవుణ్ణి చూసి సత్యానికి మళ్ళీ స్పృహ తప్పింది.

ధర్మయ్య సత్యం ముఖం మీద నీళ్ళు జల్లి నించోబెట్టి జరిగిన విషయం అంతా చెప్పాడు. "అమ్మయ్య, నాకు భయం లేదు. శవం నాకు సాక్షిగా... నిజాయితీ నీకు నూరేళ్ళు..." అంటూ దేవుడికి నమస్కరించాడు సత్యం. ★

డాక్టర్. ఎమ్. సుగుణరావు
ద న్యూ ఇండియా ఎసూరెన్స్ కంపెనీ లిమిటెడ్
డివిజనల్ ఆఫీస్, నెల్లూరు బస్టాండు ఎదురుగా,
ఒంగోలు - 523 001.

## పరిచయం



-డాక్టర్ ఎమ్.సుగుణరావు

పేరు : డాక్టర్ ఎమ్.సుగుణరావు
స్వస్థలం : పశ్చిమ గోదావరి జిల్లా - నరసాపురం.
పుట్టిన తేది : 10-06-1961
చదువు : వెటర్నరీ సైన్సులో మాస్టర్స్ డిగ్రీ
ఉద్యోగం : అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, న్యూ ఇండియా ఎస్యూరెన్స్, డివిజనల్ ఆఫీసు, ఒంగోలు.

రచనా వ్యాసంగం: దాదాపు యాభై కథలు వివిధ వార,పక్ష, మాసపత్రికల్లో ప్రచురింపబడ్డాయి. కొన్ని కథలకు బహుమతులొచ్చాయి. నా కథ "నానాటి బతుకు" కేంద్ర సాహిత్య అకాడమీ వారి 'ఒకతరం తెలుగు కథ'లో చోటుచేసుకుంది.

అభిమాన కవులు/రచయితలు: నాటి కవుల్లో తిలక్, నేటి కవుల్లో శివారెడ్డిల కవిత్వం నాకు ప్రేరణ. నాటి రచయితల్లో రావిశాస్త్రి, నేటి రచయితల్లో కె.ఎన్.వై. పతంజలి.

కోరిక : ఎప్పటికైనా ఓ మంచికథ రాయాలని.